తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం





# అధిక వడ్డీ ఆశతో శ్రీ ప్రియాంక దోపిడి

## 200 కోట్లు వసూలు చేసి ఉడాయించిన సంస్థ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

హైదరాబాద్,మే 20: అధిక వడ్డీ ఆశ చూపి రూ.200 కోట్లతో ఉడాయించిన ఘటన హైదరాబాద్ లోని అబిడ్స్‌లో జరిగింది. అబిడ్స్ లోని శ్రీ ప్రియాంక ఎంటర్ ప్రైజెస్ డిపాజిట్ ల రూపంలో డబ్బులు తీసుకొని అధిక వడ్డీలు ఇస్తామని నమ్మబలికి 517 మంది దగ్గరి నుంచి దాదాపు రూ.200 కోట్లు వసూలు చేసి జెండా ఎత్తేసింది. దీంతో బాధితులు బషీర్ బాగ్ లోని హైదరాబాద్ సీసీఎస్ పోలీసు స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మిగతా 2లో..

# ఫెడెక్స్ పార్సిల్స్ పేరుతో వచ్చే మోసపూరిత కాల్స్

## ప్రజలను హెచ్చరించిన ఆర్టీసీ ఎండి సజ్జన్నార్



హైదరాబాద్,మే20: ఇటీవల ఫెడెక్స్ కొరియర్ పేరుతో చాలా మందికి కాల్స్ వస్తున్నాయి. ఆధార్ నెంబర్‌తో పార్సిల్ వచ్చిందని.. అందులో అక్రమంగా రవాణా చేస్తున్న మాదక ద్రవ్యాలు పట్టుబడ్డాయని భయాందోళనకు గురి చేస్తున్నారు. డ్రగ్స్ రవాణా కేసులో శిక్షలు కఠినంగా ఉంటాయని.. కేసుల నుంచి తప్పించుకునేందుకు రూ.లక్షల్లో డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇలా ఎందరో సైబర్ నేరగాళ్ల బారినపడి లక్షల్లో సొత్తును నష్టపోయారు. ఈ క్రమంలో తెలంగాణ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ప్రజలకు కీలక సూచనలు చేశారు. ఫెడెక్స్ పార్సిల్స్ పేరుతో వచ్చే మోసపూరిత కాల్స్‌ని నమ్మొద్దని.. పోలీసులమని చెప్పగానే భయపడి డబ్బులు ఇవ్వొద్దని చెప్పారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా అనుమానం వచ్చినా.. మోసపోయినా వెంటనే 1930 నంబర్‌కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అయితే, సైబర్ నేరగాళ్ల బారినపడ్డ వారిలో ఎక్కువ మంది విద్యావంతులే ఉండడం ఆందోళనకరమన్నారు. సైబర్ నేరగాళ్లు మోసాలకు కొత్త కొత్త వాటిని ఎంచుకుంటున్నారన్నారు. ఇంతకు ముందు ఓటీపీ, ఓఎల్ఎక్స్, రెంట్ పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడ్డారన్న ఆయన.. తాజాగా ఫెడెక్స్ పేరుతో మోసాలకు తెరలేపారని చెప్పారు. తాము పోలీస్‌స్టేషన్ నుంచి మాట్లాడుతున్నామని.. మీరు పంపిన పార్సిల్‌లో డ్రగ్స్ ఉన్నాయంటూ బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు గుంజుతున్నారని అన్నారు. ఎవరూ పార్సిల్స్ పంపనప్పుడు ఎందుకు భయందేనికని ప్రశ్నించారు. మోసాల బారినపడుతున్న వారిలో విద్యావంతులే ఎక్కువ ఉన్నారన్నారు. అవతలి వ్యక్తులు భయపడితే భయపెడతారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. అలాగే, పెట్టుబడులు పెడితే లక్షల్లో ఆదాయం వస్తుందని ఆశపడొద్దని సూచించారు. అన్ని వివరాలు తెలుసుకున్న తర్వాతే పెట్టుబడులు పెట్టడం మంచిదని చెప్పారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ దే విజయం

## మాజీమంత్రుల విశ్వాసం



నల్లగొండ,మే 20: గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ వరుసగా నాలుగుసార్లు విజయఢంకా మోగించిందని.. ఈ ఎన్నికల్లోనూ విజయం బీఆర్ఎస్‌దేనని మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ అన్నారు. నల్గొండ జిల్లా కేంద్రంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న మోసం అందరికీ అర్థమైందన్నారు. గుజరాత్‌లో సైతం పేదరికం పెరిగిందని.. దేశం యావత్ అంధకారంలోకి వెళ్లిందన్నారు. ఎన్నికలప్పుడే పాకిస్థాన్ గురించి బీజేపీ వాళ్లు మాట్లాడుతారన్నారు. బీజేపీ అసలు రంగు బయటపడిందని.. కాంగ్రెస్

మిగతా 2లో..

# కాంగ్రెస్ వందరోజుల జూటా హామీలు

## అంతా జూటా అని తేలిందన్న హరీష్‌రావు



నల్లగొండ,మే 20: బడి పంతుళ్లపై లాఠీలు.. బడుగు జీవులకు జూటా హామీలు.. ఇదీ రేవంత్ పాలన అంటూ మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. దేవరకొండలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ వంద రోజుల హామీ అమలు కాలేదు.. విద్యార్థి భరోసా కార్డు రాలేదు.. స్కూటీ, నిరుద్యోగ భృతి ఇవ్వలేదు.. నిరుద్యోగ భృతి అమలు పట్ల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతులెత్తేశారు అని హరీశ్‌రావు తెలిపారు. ఎన్నికల ముందు ప్రియాంక, రాహుల్, రేవంత్ ఇచ్చిన ఏ హామీ కూడా

మిగతా 2లో..

# కిర్గిజ్‌స్థాన్ ఘటనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా

హైదరాబాద్,మే20: కిర్గిజ్‌స్థాన్ ఘటనలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారు. సీఎం ఆదేశాల మేరకు అధికారులు బిష్కెక్‌లోని భారత రాయబారితో మాట్లాడారు. అక్కడ జరిగిన ఘటనల్లో భారతీయ విద్యార్థులు ఎవరూ గాయపడలేదని.. అంతా క్షేమంగానే ఉన్నారని రాయబారి తెలిపారు. సోషల్ మీడియా పోస్టుల్లో నిజం లేదని స్పష్టంచేశారు. కిర్గిజ్‌స్థాన్ రాజధాని బిష్కెక్‌లో గత రెండు మూడు రోజులుగా భారత్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ విద్యార్థులు ఉంటున్న హాస్టళ్లపై దాడులు జరుగుతున్న ఘటనలు కలవరపెడుతున్నాయి. ఈ గొడవలకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో వైద్య విద్యనభ్యసించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి కిర్గిజ్‌స్థాన్ వెళ్లిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్న వేళ.. సీఎం రేవంత్ స్పందించారు.

# ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

– జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్






**కామారెడ్డి జిల్లా ప్రజాజ్యోతి ప్రతినిధి మే 20.** ఇంటర్మీడియట్ అడ్వాన్స్ స్లప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చీఫ్ సూపెరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులకు సూచించారు. ఈ నెల 24 నుండి జూన్ 3 వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాన్నం 12 గంటల వరకు కొనసాగనున్న ఇంటర్మీడియట్ ప్రధమ, ద్వితీయ పరీక్షలు, ఒకేషనల్ పరీక్షల నిర్వహణపై సోమవారం కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధులు కేటాయించిన అధికారులు వెంటనే ఆయా పరీక్షా కంద్రాలను సందర్శించి ఫర్నీచర్, విద్యుత్, మంచినీరు, వెలుతురు వంటి మౌలిక సదుపాయాలును పరిశీలించి ఏమైనా లోటుపాట్లు ఉంటె తెలిపితే తగు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రధమ,ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలకు 10,511 మంది విద్యార్థులు హాజరు కానున్నారని ఇందుకోసం 29 కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో ఇంటర్మీడియట్ ఉతీర్ణత శాతం తక్కువగా ఉందని ఉదార స్వభావం చూపరాదని, మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్ అనుమతించవద్దని తద్వారా జిల్లాకు చెడ్డపేరు రావడమే గాక పిల్లల భవిష్యత్తు దెబ్బతింటుందని హెచ్చరించారు. పరీక్షలు జరుగుతున్నపుడు పరీక్షా కేంద్రాన్ని మొత్తాన్ని కలియ తిరగాలని, పరీక్షలు సాఫీగా, పారదర్శకంగా జరిగేలా చూడాలని, ఏ చిన్న సమస్య రాకుండా చూడాలని, విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షా కేంద్రాలకు ఎలక్ట్రానిక్ గాడ్జెస్ అనుమతి లేదని, ఒక్క నిముషం ఆలస్యమైన విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు అనుమతించవద్దని సూచించారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తాయన్నారు.పరీక్షా కేంద్రాలకు సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలనీ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టీసీ బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవడంతో పాటు పరీక్షా కేంద్రాలవద్ద ప్రథమ చికిత్స ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం, పరీక్షల విభాగం అధికారులు శ్రీనాథ్, నాగేశ్వరయ్య, చీఫ్ సూపెరింటెండెంట్లు, శాఖాపర అధికారులు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అందుబాటులో జీలుగు విత్తనాలు

**నాగిరెడ్డిపేట్ మే 20(ప్రజా జ్యోతి)** మండలంలోని రైతులకు జీలుగు విత్తనాలను సబ్సిడీపై అందజేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి విజయ్ శేఖర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జీలుగ విత్తనాలు తాండూర్,మాల్తుమ్మెద సొసైటీలో రైతులకు అందుబాటులో ఉంచామని రైతులు ఆధార్ కార్డు,పట్టా పాసుబుక్ జిరాక్స్ తీసుకోని సంబంధిత ఏఈవోల వద్ద పర్మిట్ తీసుకోని రైతులకు 60 శాతం సబ్సిడీపై 30 కేజీల బస్తా 1116/- రూపాయలకు అందజేయన్నుట్లు తెలిపారు. 30 కేజీల బస్తా రెండున్నర ఎకరాలకు సరిపోతుందని మండల వ్యవసాయ అధికారి తెలిపారు.

# అప్పాయిపల్లి శంకర్రావును పరామర్శించిన చిన్నారెడ్డి




**వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 20(ప్రజా జ్యోతి):** ఉమ్మడి పాలమూరు జిల్లా మాజీ డిసిసిబి ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అప్పాయిపల్లి శంకరరావును సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో చికిత్స తీసుకుంటున్న విషయం తెలుసుకొని వనపర్తిలోని ఆయన నివాస గృహంలో ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బి రాజేంద్రప్రసాద్ యాదవ్, కాంగ్రెస్ నేత బి కృష్ణ, జిల్లా కార్యదర్శి రాగి వేణు, సింగిల్ విండో డైరెక్టర్ డి. భాస్కరరావు,కాంగ్రెస్ నేతలు నాయకులు చెన్న రాములు,పెద్దమందడి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెంటయ్య యాదవ్ భాస్కర్ తదితరులు ఉన్నారు.

# బిచ్కుంద మండల కేంద్రంలో ఓ ప్రైవేట్ పాఠశాల ఆగడాలు




**కామారెడ్డి జిల్లా ప్రజాజ్యోతి ప్రతినిధి మే 20.** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రం లోని ఓ ప్రైవేటు పాఠశాల నయా దందాకు తెరతీసింది. ఎన్ ఐ టి, నీట్, ఐఐటి, ఒలింపియాడ్ పేరుతో భారీగా ఫీజులు వసూలు చేస్తూ ఈ దందాకు ఆ పాఠశాల యాజమాన్యం తెర లేపారు. తాజాగా నిబంధనలు పాటించకుండా అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పనిచేసి పిల్లల్ని చదివిస్తుంటే ఎన్ఐటి, నీట్, ఐఐటి, ఒలింపియాడ్ పేరుతో, పలు రకాల ఫీజుల పేరుతో దోపిడీకి గురి చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే బిచ్కుంద లోని పలు పాఠశాలలు అధిక ఫీజులు వసులుకు పాల్పడుతున్నాయని, అలాంటి పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రుల తరఫున నిరంతరం పోరాటం చేస్తామని పలు విద్యార్థి సంఘాలు ఇప్పటికే తెలియజేశారు.

**సామాన్యుడికి అందని ద్రాక్ష**

సామాన్యుడికి ఉన్నత విద్య అందని ద్రాక్షగానే మిగులుతోంది. మధ్య తరగతి తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉన్నత విద్యను అందించాలనుకునే ఆశయం ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల వ్యాపార ధోరణితో నీరుగారుతోంది. ఎంతో కష్టపడి సంపాదించిన సంపాదన అంతా పిల్లలు చదువు కే ఖర్చు అవుతుండడంతో పేద, మధ్యతరగతి వారు ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివించాలంటే భయపడే పరిస్థితులు ఉన్నాయి. విద్య వ్యాపారంగా మారడంతో ప్రైవేటు పాఠశాలలు ఇష్టారీతిన ఫీజు లను వసూళ్లు చేస్తూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు స్కూల్లో చదివించాలనే ఆకాంక్షను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమవుతుంటే చాలు బిచ్కుందలో విద్యార్థుల తల్లిదండ్రులు భయపడే పరిస్థితులు ఉన్నాయి. ఫీజులకు తోడు.. యూనిఫాంలు, పుస్తకాలు, నోట్ బుక్స్, బస్ ఫీజులు అంటూ విద్యార్థి తల్లిదండ్రుల ప్రాణాల మీదికి తీసుకొస్తున్నారు. బిచ్కుంద లో ఆ ప్రైవేటు పాఠశాల నుంచి ఫోన్లు వస్తే చాలు ఏం మాట్లాడాలో తెలియని అయోమయ పరిస్థితిలో తల్లిదండ్రులు ఉంటున్నారు. గత విద్యా సంవత్సరం కంటే ఈ విద్యా సంవత్సరం 10 నుంచి 30 శాతం వరకు ఫీజులను ప్రైవేట్, కార్పొరేట్ స్థాయిలో ఆ పాఠశాల ఫీజులు పెంచేయడంతో సామాన్య మధ్యతరగతి వారు. ఇబ్బందులు పడుతున్నారు.

**దీనికి తోడు పుస్తకాలు..**

నోట్ బుక్స్ రేట్లు గత ఏడాది కంటే 20 శాతం పెరగడంతో అవి కూడా విద్యార్థుల తల్లిదండ్రులకు అదనపు భారంగా మారుతున్నాయి. మండలంలోని కొన్ని ప్రైవేటు పాఠశాలలు తమ పాఠశాలలో అడ్మిషన్ల కోసం డొనేషన్లు బహిరంగంగానే వసూలు చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా విద్యా శాఖ అధికారులు మాత్రం ప్రైవేటు, పాఠశాల ల ఫీజు దోపిడీని నియంత్రించడంలో విఫలమవుతున్నారు. ప్రతి ఏడాది ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు యథేచ్ఛగా దోపిడీకి పాల్పడుతున్న అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

**తోక పేర్లు, వసతుల పేరిట దోపిడీ..**

మండలంలో ఓ ప్రైవేట్, పాఠశాల నయా దోపిడీకి శ్రీకారం చుట్టింది. తమ వద్ద కొన్ని ప్రత్యేక మైన వసతులు, ప్రత్యేకమైన తరగతులు ఉంటాయని చెబుతూ తల్లిదండ్రుల నుంచి ముక్కు పిండి మరీ ఫీజులు వసూలు చేస్తున్నారు. తమ పిల్లల భవిష్యత్ బాగుండాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు తప్పని పరిస్థితిలో చెల్లిస్తున్నారు. హైదరాబాద్ లాంటి నగరలకు వెళ్లి తమ పిల్లలను చదివించలేని పరిస్థితిలో ఉన్న కుటుంబాలు ఇక్కడే స్థానికంగా ప్రైవేట్ స్కూళ్లలో చదివిస్తున్నారు. అదే అదునుగా భావిస్తున్న ఆ ప్రైవేట్, పాఠశాల ఫీజులను పెంచేసి దోపిడీకి పాల్పడుతుంది. మండలంలో ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో ఎల్కేజీ, యూకేజీ, నర్సరీ తరగతుల ఫీజులే రూ.30 వేల వరకు ఉన్నాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థమవుతుంది. దీనికి తోడు నోట్ బుక్స్, డ్రెస్సులు, బస్సు ఫీజులు అంటే తల్లిదండ్రులకు ప్రైవేటు విద్యా అదనపు భారంగా మారుతుంది. విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు ఆ పాఠశాల పై శాఖా పరమైన చర్యలు తీసుకుని ఫీజుల నియంత్రణ చేయాలని పలువురు విద్యార్థులు తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

# సఖీ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్

**నారాయణపేట జిల్లా ప్రతినిది ప్రజాజ్యోతి మే20:** నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎర్ర గుట్ట వద్ద గల సఖీ కేంద్రాన్ని సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రానికి రెగ్యులర్ గా వచ్చే ఫిర్యాదులు – కేంద్రం ద్వారా చూపిన పరిష్కారాల గురించి అక్కడి నిర్వాకులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా బాల్య వివాహాల నివారణకు చేపడుతున్న చర్యల గురించి ఆయన ఆరా తీశారు. బాల్య వివాహాలను అరికట్టి వాటిని ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత రెండు నెలలుగా ఎన్ని ఫోక్సో కేసులు నమోదయ్యాయని అడిగి తెలుసుకున్నారు. అలాగే లైంగిక వేధింపుల కేసుల వివరాలను పరిశీలించారు. కేంద్రానికి వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని సఖి కేంద్ర నిర్వాహకులను కలెక్టర్ ఆదేశించారు. డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ హెల్ప్ లైన్ కు ఎన్ని కాల్స్ వస్తున్నాయని, వాటికి చూపిన పరిష్కారం ఏమిటని ప్రశ్నించారు. హెల్ప్ లైన్ కు వచ్చే కాల్స్ ఫిర్యాదులపై అలసత్వం చూపవద్దని తెలిపారు. సఖి,చైల్డ్ ప్రొటెక్షన్ హెల్ప్ లైన్ కు సంబంధించిన మార్చి, ఏప్రిల్ నెలల ఫైల్స్ ను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డి డబ్ల్యు ఓ నరసింహారావు, సఖి కేంద్రం నిర్వాహకురాలు క్రాంతి రేఖ, లీగల్ కౌన్సిలర్ రమా దేవి,చైల్డ్ హెల్ప్ లైన్ అధికారి తిరుపతయ్య పాల్గొన్నారు.






# నాగర్ కర్నూల్ జిల్లాలో గాలివాన బీభత్సం

- దాదాపు అరగంట పాటు కురిసిన వర్షం - నెలకొరిగిన విద్యుత్ స్తంభాలు చెట్లు
- పలు ప్రాంతాల్లో పొంగిపొర్లిన డ్రైనేజీలు - పట్టించుకోని మున్సిపల్ శాఖ సంబంధిత అధికారులు





**నాగర్ కర్నూలు జిల్లా (ప్రజా జ్యోతి ప్రతినిధి):** నాగర్ కర్నూల్ జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో అకాల వర్షం భిబిత్యాన్ని సృష్టించాయి. ఇదిలా ఉండగా అచ్చంపేట నియోజకవర్గం లోని ఐనల్ గ్రామంలో సరఫరా చేసే 33 కెవి విద్యుత్ స్తంభాలు గాలి వాన బిబిత్యానికి నేలకొరిగి విరిగిపోగా. అమ్రాబాద్ మండలం లక్ష్మాపూర్ గ్రామానికి సరఫరా చేసే విద్యుత్ స్తంభాలు పాక్షికంగా దెబ్బతిన్నాయని సంబంధిత ఏఈ ఆంజనేయులు వివరించారు. ఫారెస్ట్ సమీపంలోని పాల శతదీకరణం కేంద్రం వద్ద చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడటం ద్వారా విద్యుత్ కి తీవ్ర అంతరాయం ఏర్పడిందని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అచ్చంపేట కల్వకుర్తి పట్టణాల్లోని పలు కాలనీలతో పాటు బస్టాండ్ ప్రాంగణం సమీపంలో డ్రైనేజీల నీళ్లు మురుగు నీళ్లతో పాటు కురిసిన వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉండడం ద్వారా పాద చెరులకు వాహనదారులకు రాకపోకులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.. సంబంధిత మున్సిపల్ శాఖ అధికారులు పట్టణాలలోని పలు కాలనీలో మురుగునీరు నిలువ ఉండకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి




**మహబూబ్ నగర్ మే 20 ( ప్రజా జ్యోతి బ్యూరో )** ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి రైతులకు సకాలం లో చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ జి.రవి నాయక్ ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించి వివిధ శాఖల ద్వారా చేపట్టిన పనులు సమీక్షించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ,చెల్లింపులు,అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన,విద్యార్థినీ,విద్యార్థులకు ఒక జత యూనిఫాం సరఫరాకు కుట్టించడం,పార్లమెంట్,శాసన మండలి ఉప ఎన్నిక కౌంటింగ్ కు ఏర్పాట్లు,పారిశుధ్యం,బయో మెట్రిక్ హాజరు అంశాల పై సమీక్షించి ఆదేశాలు జారీ చేశారు.ధాన్యం కొనుగోళ్లు కేంద్రాల ద్వారా కొనుగోలు,చెల్లింపులు పై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. వర్షాలుకురుస్తున్నందున కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా టార్పా లిన్ లు కావలసిన సంఖ్యలో అందుబాటు లో ఉంచాలని సూచించారు.ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు పంపించాలని అన్నారు ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేసి మిల్లు నుండి ట్రక్ షీట్ జనరేట్ చేసి రైతులకు చెల్లింపులు చేయాలని, పౌర సరఫరాల శాఖ అధికారులు ట్రక్ షీట్ పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారులు,పౌర సరఫరాల శాఖ,సహకార శాఖ, ఐ.కె.పి అధికారులు కొనుగోలు కేంద్రాలు సందర్శించి కొనుగోళ్లు సాఫీ గా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కు జిల్లాలో 490 పాఠశాలల్లో పనులు ప్రారంభించినట్లు తెలిపారు.అంచనా వ్యయం లో 25 శాతం నిధులు కూడా విడుదల చేసినట్లు,పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులు,విద్యా శాఖ అధికారులు,ఎం.పి.డి. ఓ.లు,మండల ప్రత్యేక అధికారులు పనులు పూర్తి పై సమీక్షించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులకు పాఠశాలలు ప్రారంభం కు ముందే స్కూల్ యూనిఫాం లు ఒక జత సరఫరా చేసేందుకు చేపట్టిన పనులు పై సమీక్షించారు. ఇప్పటికే జిల్లాకు అవసరమైన క్లాత్ వచ్చినందున కటింగ్ కు,కుట్టించుటకు మహిళా సంఘాల ద్వారా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో,పట్టణాల్లో వర్షా కాలం కు ముందు గానే చేపట్ట వలసిన పనులపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ఫాగింగ్,ఆంటీ లార్వా ఆపరేషన్ లు,క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు.ఆయా శాఖల ద్వారా బయో మెట్రిక్ హాజరు శాతం పై సమీక్షించారు. లేట్ గా హాజరు కావడం, సకాలంలో హాజరు కాని సిబ్బందిపై మెమో జారీ చేసి క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మహబూబ్ నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ ఉప ఎన్నిక,పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ కు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసి,కౌంటింగ్ సిబ్బంది ని, మైక్రో అబ్జర్వర్ లను నియామకం చేసి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సి.ఎం.కార్యాలయం నుండి వచ్చిన పిర్యాదులు ఈ నెలాఖరులోగా పరిష్కారం చేయాలని ఆదేశించారు. ప్రజావాణి, ఈ ఆఫిస్ ఫైళ్ల ను పెండింగ్ లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సమావేశం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# బేక్ హౌస్ బేకరీని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్



**పరిగి, మే 20 : (ప్రజా జ్యోతి)** పరిగి పట్టణంలో సోమవారం సయ్యద్ పల్లి గ్రామానికి చెందిన హఫీజ్ పరిగి పట్టణానికి చెందిన సమీర్ నూతనంగా ఏర్పాటు చేసిన బేక్ హౌస్ బేకరీని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కరణం అరవింద రావు, సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, సయ్యద్ పల్లి వెంకటయ్య, అన్వర్ సేట్ కౌన్సిలర్లు జాక్ రవి, వారాల రవి, కృష్ణ , వెంకటేష్, మౌలానా, ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట రామకృష్ణారెడ్డి, తదితరుల పాల్గోన్నారు.

# కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలో గాలివాన బీభత్సం



**కొడంగల్ మే 20 ప్రజా జ్యోతి న్యూస్ ::** కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఉరుములు మెరుపులతో గాలి వాన బీభసం సృష్టించింది. కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ స్తంభాలు, చెట్లు, విరిగిపడడంతో కొద్దిసేపు విద్యుత్ అంతరాయం కలిగిన అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ పునరుద్ధరించారు. కొడంగల్ మున్సిపల్ పరిధిలోని గుండ్లకుంట లో గాజుల బసమ్మ ఇంటి పైకప్పు గాలి వాన బీభత్సంతో దూరంగా వెళ్లి పడడంతో ఇంటిలో ఉన్న బియ్యము వంట సామాగ్రి తదితర వస్తువులన్నీ వర్షానికి తడిసిపోయి పాడవడంతో గాజుల బసమ్మ కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ ప్రభుత్వము అధికారులు సహాయం చేయాలని వేడుకున్నారు. సమాచారం తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ రమేష్ కావున గాజుల బసమ్మ ఇంటిని పరిశీలించి అధికారులకు విన్నవించి సహాయం అందేటట్లు చేస్తామని తెలియజేశారు .

# అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ పద్మమ్మ కన్నుమూత

**కోడంగల్ మే 20 ప్రజా జ్యోతి న్యూస్ ::** అనారోగ్యంతో బాధపడుతున్న అంగన్ వాడి టీచర్ పద్మమ్మ కన్నుమూసింది. అనారోగ్యంతో బాధపడుతు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొడంగల్ నియోజకవర్గ ఉమ్మడి బొంరాస్పేట మండలం అల్లికన్ పల్లి అంగన్వాడి కేంద్రం లో అంగన్వాడి టీచర్ గా విధులు నిర్వహిస్తున్న పద్మమ్మ అనారోగ్యానికి గురికావడంతో సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతి వార్తను తెలుసుకున్న ఐసిడిఎస్ సిడిపిఓ విజయలక్ష్మి. సూపర్వైజర్ మనిమల. ప్రతిభ. మహేష్ ఆమె నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి దహన సంస్కారాలకు 2000 వేల రూపాయల చెక్కును అందించారు.



# ఈనెల 24న పాలీసెట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- వికారాబాద్ జిల్లా కేంద్రంలో 3 సెంటర్లలో 1321 అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు
- అభ్యర్థులు గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి
- జిల్లా సమన్వయకర్త ఏం పరమేశ్వర్

**వికారాబాద్ ప్రతినిధి,మే 20(ప్రజా జ్యోతి):** పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష మే 24 న వికారాబాద్ జిల్లా కేంద్రంలో జరుగుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా సమన్వయకర్త యం.పరమేశ్వర్ తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో 2024 సంవత్సరానికి ప్రవేశాల కోసం మే 24న (శుక్రవారం) పాలీసెట్ పరీక్ష ఉదయం 11.00 గం. నుండి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పాలీసెట్ ప్రవేశ పరీక్ష వికారాబాద్ పట్టణంలోని 03 పరీక్షా కేంద్రాలలో నిర్వహిచబడుతుందని తెలిపారు. ఈ పరీక్షకు వికారాబాద్ జిల్లాకు చెందిన 1321 అభ్యర్థులు అందులో గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల, కొంపల్లిలో 240 మంది, భృంగీ ఇంటర్నేషనల్ స్కూల్, ఎన్నెపల్లి లో 600 మంది, శ్రీ అనంత పద్మనాభ డిగ్రీ కళాశాల, వికారాబాద్ లో481 మంది హాజరు అవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు అందరు ఉదయం పది గంటలలోపు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, 11 గంటలు దాటిన తరువాత ఒక్క నిమిషం అలస్యంగా వచ్చిన పరీక్ష వ్రాయడానికి అనుమతించబడదన్నారు. అభ్యర్థులు అందరు హాల్ టికెట్ లు తీసుకొని పరీక్షకు హాజరు కావాలని, పరీక్షా వ్రాసే విద్యార్థులు అందరూ తప్పక తమ వెంట పెన్నులు, పెన్సిలు, ఎరేజర్ తీసుకొని పరీక్షకు నిర్ణిత సమయంలో హాజరు కావాలని ఆయన తెలిపారు.



# ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పెంపు


## – డిఐఓ శంకర్ నాయక్



**వికారాబాద్ ప్రతినిధి, మే20(ప్రజా జ్యోతి):** ఇంటర్మీడియట్ సప్లీమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈనెల 21 వ తేదీ వరకు పరీక్ష ఫీజు గడువు పెంచినట్లు జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి ఎన్. శంకర్ తెలిపారు. సప్లీమెంటరీ పరీక్షలకు సంబంధిత కళాశాలలో 2 వేల రూపాయల ఆలస్య రుసుంతో చెల్లించ వచ్చునని ఆయన తెలిపారు. విద్యార్థులు వారి తల్లి దండ్రులు, కళాశాలల నుండి వచ్చిన విజ్ఞప్తుల మేరకు తెలంగాణ ఇంటర్ బోర్డు ఈ నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ఇంతకు ముందు ఫీజు చెల్లించని విద్యార్థులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

# ఐటిఐ మొదటి విడత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

## – జిల్లా కన్వీనర్ ఐటిఐ ప్రిన్సిపాల్ నరేంద్రబాబు



**వికారాబాద్ ప్రతినిధి, మే 20(ప్రజా జ్యోతి):** ఐటిఐ కోర్సులలో మొదటి విడత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా జిల్లా కన్వీనర్ , ఐటిఐ ప్రిన్సిపాల్ నరేంద్ర బాబు తెలిపారు. ఐటిఐ మొదటి విడత అడ్మిషన్స్ కొరకు వికారాబాద్ జిల్లాలోని ప్రభుత్వ , ప్రైవేటు ఐటిఐ కోర్సులలో 2024-25/26(1సంవత్సరం, 2 సంవత్సరం) విద్యా సంవత్సరానికి గాను కళాశాలలో చేరేందుకు విద్యార్థిని, విద్యార్థుల నుండి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు https://iti.Telangana.gov.in వెబ్సైట్ నందు ఆన్లైన్ లో మే 21 నుండి జూన్ 16 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆసక్తిగల 10వ తరగతి, 8వ తరగతిలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోగలరని ఆయన తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి వెబ్సైట్ నందు అప్లోడ్ చేయవలసిందిగా ఆయన సూచించారు. మరిన్ని వివరముల కోసం 9177472488, 8555865421 నెంబర్లను సంప్రదించవలసిందిగా పేర్కొన్నారు.

# 4వ సీనియర్ నేషనల్ త్రోబాల్ ఛాంపియన్ షిప్ షెడ్యూల్‌ని ప్రకటించిన తెలంగాణ స్టేట్ త్రోబాల్ అసోసియేషన్

## – ఈ వెంట్ నిర్వహణ తెలంగాణకు అవకాశం కల్పించిన త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు కృతజ్ఞతలు

## – టీపీసీసీ అధికార ప్రతినిధి డా సత్యం శ్రీరంగం




**కూకట్ పల్లి, మే 20 (ప్రజా జ్యోతి) :** సోమాజిగూడా ప్రెస్ క్లబ్ లో 47 వ సీనియర్ నేషనల్ త్రోబాల్ ఛాంపియన్ షిప్ షెడ్యూల్ ని త్రోబాల్ చైర్మన్ మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, చీఫ్ ప్యాట్రన్ అమీర్ అలీ ఖాన్, తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షులు, నేషనల్ గేమ్స్ ఆర్గనైజింగ్ చైర్మన్ టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, కోశాధికారి జమీల్, జనరల్ సెక్రటరీ కృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కృష్ణ రాజ్ పుత్, చిత్ర షెనోయ్, జాయింట్ సెక్రటరీ సిహెచ్. శ్రీనివాస్ లు ప్రకటించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సత్యం శ్రీరంగం మాట్లాడుతూ 47 వ సీనియర్ నేషనల్ త్రోబాల్ ఛాంపియన్‌షిప్ జూన్ 6 నుండి జూన్ 8, 2024 వరకు హైదరాబాద్‌లో ఈ గొప్ప ఈవెంట్‌ను నిర్వహించేందుకు తెలంగాణకు అవకాశం కల్పించిన త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ ఛాంపియన్‌షిప్‌కు సన్నాహకంగా, మా ఎంపిక బృందం తెలంగాణ త్రోబాల్ జట్టును మే 25, 2024న ఉదయం 10 గంటల నుండి హయత్‌నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ ఎడ్యుకేషనల్ సొసైటీలో ఎంపిక చేస్తుందని, ఆసక్తిగల క్రీడాకారులు రావాలని అన్నారు. ఈ ఛాంపియన్‌షిప్‌ను స్మారక విజయంగా మరియు పాల్గొనేవారికి మరియు ప్రేక్షకులందరికీ మరపురాని అనుభూతిని అందించాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు.

# నేడు అజూనీ బయోటెక్ లిమిటెడ్ రైట్స్ ఇష్యూ



**హైదరాబాద్, మే 20 (ప్రజా జ్యోతి) :** స్వచ్ఛమైన శాకాహార పశు ఆరోగ్య సంరక్షణ కంపెనీ అజూనీ బయోటెక్ లిమిటెడ్(ఎన్ఎస్ఈ-ఏజేఓఎన్ఐ) తన రూ.43.81 కోట్ల రైట్స్ ఇష్యూను మే 21న తెరవనున్నట్లు అజూనీ బయోటెక్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ జస్జోత్ సింగ్ సోమవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ ఇష్యూ ద్వారా సేకరించిన నిధులను భూసేకరణ, సైట్ డెవలప్‌మెంట్, సివిల్ వర్క్, ప్లాంట్, మిషనరీ లాంటివి సేకరించడంతో పాటు వర్కింగ్ కేపిటల్ అవసరాలు, కార్పొరేట్ అవసరాలకు ఉపయోగించనున్నట్లు చెప్పారు. కంపెనీ రైట్స్ ఇష్యూ 20 శాతం పైగా డిస్కౌంట్‌తో ప్రతి షేరుకు రూ.5 ధర చొప్పున అందిస్తారని తెలిపారు. ఇది 2024 మే 18న ప్రతి షేరుకు రూ.6.5 ముగింపు షేరు ధరకు అందుబాటులో ఉంటుందన్నారు. రైట్స్ ఇష్యూ మే 31న ముగుస్తుందన్నారు. ఆన్ మార్కెట్ హక్కుల ఉపసంహరణకు మే 27 చివరి తేదిగా పేర్కొన్నారు. రైట్స్ ఇష్యూలో కంపెనీ ప్రమోటర్ గ్రూప్ కూడా పాల్గొంటోందని పేర్కొన్నారు.

# పటేల్ కంటైనర్ ప్రై.లిలో సెల్విన్ ట్రేడర్స్ పెట్టుబడులు

SELLWIN TRADERS LIMITED

**హైదరాబాద్, మే 20 (ప్రజా జ్యోతి) :** పటేల్ కంటైనర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో వ్యూహాత్మక పెట్టుబడులు పెట్టే ప్రతిపాదనకు సెల్విన్ ట్రేడర్స్ లిమిటెడ్ డైరెక్టర్ బోర్డు ఆమోదం తెలిపిందని సెల్విన్ ట్రేడర్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వేదాంత్ పంచాల్ సోమవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఆదాయంలో 56 శాతం వృద్ధిని నమోదు చేసి రూ.61.7 కోట్లకు చేరుకుందని తెలిపారు. పటేల్ కంటైనర్ లో 36 శాతం వాటాను కంపెనీ కొనుగోలు చేయనుందని చెప్పారు. పటేల్ కంటైనర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో వ్యూహాత్మక పెట్టుబడులు పెట్టేందుకు 2024 మే 15న ఎంఓయూ కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా 100 మందికి ఉపాధి లభిస్తుందని అన్నారు. 2023 ఆర్థిక సంవత్సరంలో రూ.39.60 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం 2024 ఆర్థిక సంవత్సరంలో 56 శాతం వృద్ధితో రూ.61.7 కోట్లకు చేరుకుందన్నారు.

# మృతుడి అంత్యక్రియలకు డీవీజీ ట్రస్టు ఆర్థికసాయం

**కూకట్‌పల్లి, మే 20 (ప్రజా జ్యోతి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆల్విన్ కాలనీ 124 డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కాలనీకి చెందిన డేవిడ్(19) రోడ్డు ప్రమాదానికి గురై మరణించారు. విషయం తెలుసుకున్న ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తనయుడు యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి డీవీజీ ట్రస్ట్ ద్వారా రూ.5 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మేరకు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, ఫారూఖ్, నాగరాజు పాల్గొన్నారు.



## జగదీశ్వర్ గౌడ్‌ని మర్యాదపూర్వకంగా

# కలిసిన ఆల్విన్ కాలనీ డివిజన్ నాయకురాళ్లు

**కూకట్‌పల్లి, మే 20 (ప్రజా జ్యోతి) :** పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ ని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అద్వర్యంలో డివిజన్ తరపునుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు మహిళా నాయకురాళ్లు మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, నాగేష్ గౌడ్, షౌకత్ అలీ మున్నా, డి.గోపాల్, ఎం.లిగంరావు, భీమ్ రావు, వై.శ్రీనివాస్, డి.సుధాకర్, ప్రభాకర్, రాజ్యలక్ష్మి, అరుణ, సౌందర్య, స్వరూప, కృష్ణవేణి, అనురాధ, నిర్మలమ్మ, శ్యామల, రాజేశ్వరి, నాగలక్ష్మి, పర్వీన్, యస్మిన్, మహముదా, నికత్ ఫాతిమా, నూర్జహాన్, నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.



# గేట్ దిమ్మె కూలి బాలిక మృతి



షాద్ నగర్, మే 20(ప్రజాజ్యోతి):ఫరూఖ్ నగర్ మండలం మధురాపూర్ గ్రామంలో ప్రమాదం చోటుచేసుకుంది. పినమోని మల్లేష్ రమాదేవి దంపతుల చిన్న కూతురు సాక్షిని ప్రమాదవశాత్తు మృతి చెందింది. నాలుగున్నర సంవత్సరాల బాలిక సరదాగా తోటి స్నేహితులతో ఆడుకుంటున్న సమయంలో ఇంటిముందున్న ఇంటి ప్రహరీ గోడకు ఒరిగిన గేటు దిమ్మెను పట్టుకోగా అది పాప తలపై పడడంతో తలకు తీవ్ర గాయాలయి మెదడుచిట్లి అక్కడికక్కడే బాలిక మరణించింది. కండ్లముందే ఆడుతూ పాడుతూ ఉన్న బాలిక ఒక్కసారిగా విగతజీవిగా మారిన పాపను చూసి తల్లిదండ్రులు బంధుమిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## సమయ పాలన పాటించని వ్యవసాయ అధికారి సిబ్బంది!



(ప్రజాజ్యోతి మే20/తలకొండపల్లి) సమయపాలన పాటించని వ్యవసాయ అధికారి, సిబ్బంది..! కార్యాలయాలకు చేరుకొని తిరిగి వెళుతున్న రైతులు : ప్రస్తుత యాసంగిలో రైతులు పండించిన వరి ధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటు ప్రతి గింజలు కొంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి నుంచి జిల్లా కలెక్టర్ వరకు చెబుతున్న మాటలు పత్రికలకే పరిమితమవుతున్నాయి. స్థానికంగా మండలానికి చెందిన అధికారులు సమయపాలన పాటించకపోవడంతో ప్రజలు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామంటున్నారు. సోమవారం కడ్తాల్ మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయానికి ఉదయం 11 గంటల ప్రాంతంలో రైతులు చేరుకున్నారు. ఆ సమయంలో కార్యాలయంలో ఏవో లేక ఖాళీ కుర్చీ దర్శనం ఇచ్చింది సిబ్బంది కూడా ఎవరు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. యాసంగి సీజన్ లో రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని అధికారులు చెబుతున్న ఇక్కడ అమలు జరగడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు.వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు దాన్యాన్ని తరలిస్తే మండల వ్యవసాయ అధికారుల నుంచి రాయించుకొని రావాలని కొనుగోలు కేంద్రాల వద్ద సిబ్బంది చెబుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. తీరా కార్యాలయం వెళ్తే అధికారులు ఎవరు అందుబాటులో ఉండడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ కార్యాలయానికి జనుములు కోసం పలువురు రైతులు జిరాక్స్ కాపీలు తీసుకొచ్చిన అధికారులు లేకపోవడంతో చేసేది లేక వెనుతిరిగి వెళ్తున్నామని తెలిపారు. పై విషయమై పలువురు రైతులు డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా దృష్టికి తీసుకెళ్లగా ఈ విషయమై జిల్లా వ్యవసాయ అధికారికి కడ్తాల్ ఏవో కార్యాలయం గురించి ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటికైనా మండల వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి సకాలంలో సలహాలు సూచనలు అందించాలని ఆయన కోరారు.

## కాంగ్రెస్ పార్టీ అంటేనే ఒక కన్ఫ్యూజన్ పార్టీ

– చేవెళ్ల మాజీ పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి



శేరిలింగంపల్లి,మే 20 (ప్రజాజ్యోతి): 6 వ విడతలో ఎన్నికలు జరగబోయే దేశ రాజధాని ఢిల్లీలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో చేవెళ్ల పార్లమెంట్ భారతీయ జనతా పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.చేవెళ్ల పార్లమెంటు ప్రజలు అసెంబ్లీ ఎన్నికలతో సంబంధం లేకుండా మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ వైపు పార్టీలకు అతీతంగా మొగ్గు చూపారు.డిపాజిట్లు రాని అసెంబ్లీలలో ఇప్పుడు భారీ మెజారిటీ వస్తుంది. రాజ్యాంగం గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదు.స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి 31% దళితులు ఉన్న రాయ్ బరేలిలో అవకాశం ఇవ్వకుండా గాంధీ కుటుంబానికి రిజర్వ్ చేసుకున్నారు.లిక్కర్ స్కామ్ లో ప్రమేయం ఉన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అరెస్టు చేయమని అరిచి గగ్గోలు పెట్టిన కాంగ్రెస్ పార్టీ అదే లిక్కర్ కేసులో అరెస్ట్ అయిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కి మద్దతు ఇవ్వడం హాస్యాస్పదం అని అన్నారు.దేశ రాజధాని ప్రజలు అంతా భారతీయ జనతా పార్టీకి మరోసారి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన చెప్పారు.

## జవహర్‌నగర్ అభివృద్ధే మా లక్ష్యం మేయర్ శాంతి

– ఐకమత్యంతోనే అభివృద్ధి సాధ్యం డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్



కాప్రా జవహర్ నగర్ మే 20 (ప్రజా జ్యోతి) జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతాన్ని అభివృద్ధి చెందిన ప్రాంతంగా తీర్చిదిద్దడమే ఏకైక లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తలు స్పష్టం చేశారు. జెఎంసి లోని రాంకీ సంస్థ యాజమాన్యం ద్వారా జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కు రావలసిన సి ఎస్ ఆర్ నిధుల విషయమై సోమవారం రాంకీ సంస్థ యాజమాన్యంతో సమావేశమై చర్చించినట్లు మేయర్ శాంతి డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్త లు తెలిపారు. ఈ సందర్భంగా రామ్ కి సంస్థ యాజమాన్యం సానుకూలంగా స్పందించి జవహర్ నగర్ అభివృద్ధి విషయంలో తాము ఎప్పటికీ కట్టుబడి ఉంటామని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ సి ఎస్ ఆర్ నిధుల విషయమై జూన్ 7వ తారీకు తర్వాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ తో పాటు కార్పొరేటర్లు కోఆప్షన్ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి అందరి సలహాలు సూచనలు తీసుకొని తదుపరి రాంకీ సంస్థ యాజమాన్యంతో మరోసారి సమావేశం కానున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి, కార్పొరేటర్ లు మేక లలిత యాదవ్, కుతాడి సాయి, గొడుగు వేణు, బల్లి రోజా శ్రీనివాస్, నాగరాణి వెంకటేష్, బింగి లావణ్య సతీష్, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి,శారద మనోహర్ రెడ్డి మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలను చల్లగా చూడు తల్లి..!

– గౌడుల ఆరాధ్య దైవమైన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి కళ్యాణోత్సవం



నందిగామ, మే 20 (ప్రజాజ్యోతి): నందిగామ మండల పరిధిలోని అంతిరెడ్డిగూడ గ్రామ శివారులో ఉన్న ఈదుళ్ల రేణుకా మాత బోనాలు ఘనంగా నిర్వహించాలని గౌడ సంఘం నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. గౌడ్ల ఆరాధ్య దైవం శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణోత్సవానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.

## అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు 15వేల విరాళం..!

– పెంటనోళ్ల రవికుమార్ మాదిగ



నందిగామ, మే 20 (ప్రజాజ్యోతి) భారత రాజ్యాంగ నిర్మాత, జాతీయ ముద్దుబిడ్డ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం ఎమ్మార్పీఎస్ షాద్నగర్ ఇన్చార్జి పెంటనోళ్ల రవికుమార్ మాదిగ కొందర్గు మండల పరిధిలోని చిన్న ఉమ్మెంతల గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం సంఘం సభ్యులకు 15 వేల రూపాయల నగదును అందజేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం సభ్యులు రవికుమార్ను అభినందించారు.

## వృద్ధురాలైన కన్నతల్లిని ఇంటి నుంచి గెంటేసిన కుమారుడు

మౌలాలి, మే 20, (ప్రజాజ్యోతి): తన కన్నతల్లి ఆస్తిపై కన్నేసిన ఓ కుమారుడు వృద్ధురా లు అని కాస్త కనికరం కూడా చూపించకుండా తన ఇంటి నుంచి గెంటే సిన ఘటన మౌలాలి లో జరిగింది. ఈ సంఘటన పూర్వపరాలిలా ఉన్నా యి. మౌలాలి భరత్ నగర్ సమీపంలోని నెహ్రూనగర్ కు చెందిన మంగలిపల్లి సత్యవతి 68 సంవత్స రాలు. సోమవారం ఆమె కుమారుడు శ్రీకాంత్ ఆస్తి కోసం తన తల్లితో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో వృద్ధురాలు అని కూడా చూడకుండా ఆమెను ఇంటి నుంచి బయటకు గెంటేసి, తన ఇంటి రెండు గేట్లకు తాళం వేసుకు న్నాడు. గేటు తెరవరా..బాబూ, ఎండలో నిలబడ లేక పోతున్న.., నాకు నీరసం వస్తుంది అంటూ వేడుకున్నా ఆమె గోడును పుత్ర రత్నం ఏ మాత్రం పట్టించుకోలేదు. సహనం కోల్పోయి మరింత రెచ్చి పోతూ, తన తల్లిని నానా దుర్భాషలాడాడు. రోడ్డు న పడిన అమ్మ...బాబూ నాకు ఎవరైనా సహాయం చేయండి అంటూ దారిన వెళ్ళే వారి కాళ్ల వేళ్ళ పడి బతిమాలాడింది. ఇది గమనించిన స్థానికుడు కొకరు జోక్యం చేసుకు న్నారు. పెద్దావిడ...ఎంతైనా మీ అమ్మ..,గేట్లు తెరచి మీ అమ్మ ను ఇంటిలోకి తీసుకు వెళ్లు బాబు అని హితబోధ చేసినా, ఆ పుత్రరత్నం కనికరించ లేదు. కన్న తల్లి పట్ల అమానుషంగా ప్రవర్తించి న కొడుకు కోడలుపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.సమాచారం తెలుసుకున్న పోలీసు లు ఘటనా స్థలానికి చేరి వివరాలు సేకరించారు.



## వాస్తవాలను వక్రీకరించి అసత్య ఆరోపణలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలి

### – బాలానగర్ మైక్రోస్మాల్ ఇండస్ట్రీస్ అధ్యక్షులు అంబటి సునీల్ కుమార్



**బాలానగర్, మే 20 (ప్రజా జ్యోతి)** కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని పారిశ్రామిక వాడలోని బాలానగర్ మైక్రోస్మాల్ ఇండస్ట్రీస్ ఏర్పడిన నాటి నుండి నేటి వరకు ప్రతి రోజు పరిశ్రమల అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నుండి రాష్ట్ర మంత్రుల వరకు అందరితో కలిసి బాలానగర్ పరిశ్రమల అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేస్తున్నానని మైక్రోస్మాల్ ఇండస్ట్రీస్అధ్యక్షులు అంబటి సునీల్ సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈమేరకు తనపై వస్తున్న అవాస్తవాలపై విచారించి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని అంబటి సునీల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. గత ఏడు సంవత్సరాల నుండి బాలానగర్ మైక్రో ఇండస్ట్రీస్ లో ప్రధాన కార్యదర్శిగా ఉన్న మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర రెడ్డి మరియు కమిటీ సభ్యులందరితో కలిసి ప్రతి విషయంలో అందరి అభిప్రాయాల మేరకు బాలానగర్ మైక్రోస్మాల్ ఇండస్ట్రీస్ అభివృద్ధి కొరకు కలిసికట్టుగా కృషి చేశామని, ఏ విషయం ఎవరికి చెప్పకుండా తన సొంత నిర్ణయంతో ఎలాంటి పని చేయలేదని అంబటి సునీల్ తెలిపారు. కాగా తాను చేస్తున్న అభివృద్ధిని చూసి కొందరు చూడలేక తనపై ఓర్వలేక గుడ్డ కాల్చి మీద వేసే ప్రయత్నం చేస్తున్నారని, దానికి కమిటీలో ఉన్న మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి ప్రోత్సహించడం బాధాకర మైన విషయమని తెలిపారు. కమిటీ సభ్యులను కాదని తాను ఎలాంటి సొంత నిర్ణయం తీసుకోలేదని, సభ్యులను వ్యతిరేకించి తాను సొంతంగా ఏంచేసినా కమిటీ సభ్యుల నిర్ణయం ప్రకారం లేకుండా ఉన్నట్లయితే వాళ్ళు చెప్పిన మాటకు కట్టుబడి ఉంటానే కానీ తప్పుడు ఆరోపణలు చేస్తే సహించబోనని అధ్యక్షులు సునీల్ అన్నారు. బాలానగర్ మైక్రో స్మాల్ ఇండస్ట్రీస్ పేరుతో కొన్ని యూట్యూబ్ ఛానల్లో, తన ఫోటోను సైతం చిత్రీకరించి తన పరువు ప్రతిష్టకు బంగం కలిగించే విధంగా అవమానిస్తున్నారని, చేతిలో ఒక యూట్యూబ్ ఛానల్ ను అడ్డుపెట్టుకుని ఇష్టం వచ్చినట్టు వార్తని రాసి, ఇతరుల పరువును భంగం చేసినట్లయితే ఎవరికైనా ఇబ్బంది ఏర్పడుతుందని, నిజాలు తెలుసుకుని వార్తలు రాయాలని, కోట్లాది రూపాయల కుంభకోణమని తనపైన అబండాలు వేసిన యూట్యూబ్ ఛానల్ పై బాలానగర్ పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని బాలానగర్ మైక్రోస్మాల్ ఇండస్ట్రీస్ అధ్యక్షులు అంబటి సునీల్ సంబందిత అధికారులను కోరారు.

## నాంచారమ్మ జాతరకు ఎస్సై రాజుకు ఆహ్వాన పత్రిక అందజేత

### – నాంచారమ్మ జాతర ఆలయ కమిటీ చైర్మన్ లోకిని రాజు



**వెంకటాపూర్/ములుగు,మే 20 (ప్రజా జ్యోతి):** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామానుజాపూర్ గ్రామ పంటపొలాల మధ్య ఉన్న నాంచారమ్మ జాతర, మే 23న మహాజాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు వెంకటాపూర్ ఎస్సై చల్ల రాజుకు ఆలయ కమిటీ చైర్మన్ లోకిని రాజు సోమవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా లోకిని రాజు మాట్లాడుతూ నాలుగు రాష్ట్రాల నుండి ఎరుకల నాంచారమ్మ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వస్తారని పేర్కొన్నారు.కార్యక్రమంలో నాంచారమ్మ డైరెక్టర్లు కేతిరి బిక్షపతి,పల్లగొండ భాస్కర్, మానుపాటి రమేష్,దాసరి చిర్రా గణేష్ తదితరులు ఉన్నారు.


## బార్ అసోసియేషన్ కార్యదర్శి సత్యానందం జన్మదిన వేడుకలు



**చేవెళ్ల మే 20 (ప్రజా జ్యోతి):** చేవెళ్ల బార్ అసోసియేషన్ కార్యదర్శి బురాన్ సత్యానందం జన్మదిన వేడుకలను బార్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ సభ్యులు న్యాయవాదులు కలిసి సోమవారం చేవెళ్ళ మండలం కేంద్రంలో ఆయన జన్మదిన వేడుకలు నిర్వహించారు. బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి మహమ్మద్ తాజుద్దీన్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు జరిపారు. తాజుద్దీన్ మాట్లాడుతూ...చేవెళ్ల బార్ అసోసియేషన్ లో తొలిసారిగా దళిత వర్గానికి చెందిన సత్యానందం ఎన్నిక కావడం గర్వకారణం అన్నారు. ఆయనకు తోడుగా బార్ అసోసియేషన్ సభ్యులుగా బార్ అసోసియేషన్ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. సత్యానందం మాట్లాడుతూ... బార్ అసోసియేషన్ సభ్యులతో కలిసి జన్మదిన వేడుకను జరుపుకోవడం చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. బార్ అసోసియేషన్ లో ఉన్న సమస్యలను పెద్దల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ వేడుకల్లో గుట్టల. చంద్రశేఖర్ ఎల్. జైపాల్ కే. కుమార్ డి. సురేష్ శ్రీకాంత్ బి. శ్రీశైలం కృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

## "నిత్యం కార్మికులతోనే ఉంట కార్మికులకు అన్యాయం జరిగితే సహించేది లేదు"

### – బిఆర్‌టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్




**కూకట్‌పల్లి, మే 20 (ప్రజా జ్యోతి) :** కార్మికులకు అన్యాయం జరిగితే సహించేది లేదు అని బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని బొల్లారం ఇండస్ట్రీ ఏరియా "రెడీ మిక్స్"లారీ ఓనర్స్ నవీన్ రెడ్డి, భరత్, దగ్గర కైఫ్ అన్సరీ, ఇన్ఫాన్ అన్సరీ అనే ఇద్దరు డ్రైవర్స్ గత కొన్ని సంవత్సరాలుగా పని చేస్తూ ఉండేవారు. డ్రైవర్స్ కైఫ్ అన్సరీ, ఇన్ఫాన్ అన్సరీ, కొన్ని అనివార్య కారణాలవల్ల డ్రైవర్స్ ఇద్దరు డ్యూటీ మానేయడం జరిగింది. రెడీమిక్స్ ఓనర్స్ నవీన్ రెడ్డి, భరత్, డ్రైవర్స్ ఇద్దరికీ వేత్తనం 70/- వేల రూపాయలు ఇవ్వకుండా దుర్భాషలాడి డ్రైవర్స్ ని బెదిరించి పంపించేవాడు. వాళ్లకు ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే మనకు న్యాయం చేస్తారో అని తోటి డ్రైవర్ల ద్వారా తెలుసుకొని బిఆర్ టి యు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ అతని గురించి తెలుసుకొని రవి సింగ్ కార్యాలయం వద్దకు వెళ్లి ఎండి కైఫ్ అన్సరీ, ఇన్ఫాన్ అన్సరీ కి జరిగిన అన్యాయం చెప్పుకున్నారు. ఆ తర్వాత వెంటనే స్పందించిన రవిసింగ్ హుటాహుటిన రెడీమిక్స్ ఓనర్స్ నవీన్ రెడ్డి, భరత్, దగ్గరికి వెళ్లి డ్రైవర్స్ కు రావలసిన వేత్తనం గురించి మాట్లాడి, డ్రైవర్స్ ఒక్కొక్కరికి 35000/-రూపాయలు రాగా ఇద్దరికి కలిపి మొత్తం 70/-వేల రూపాయలు ఇప్పించారు. డ్రైవర్స్ యండి. కైఫ్ అన్సరీ, ఇన్ఫన్ అన్సరి, మాట్లాడుతూ మాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవిసింగ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, ప్రేమ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల్ని సద్వినియోగం చేసుకోవాలి

### – ఎంపీడీఓ నరేందర్ రెడ్డి



**యాచారం, మే 20 (ప్రజాజ్యోతి):** ఉపాధి హామీ పనుల్ని కూలీలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నరేందర్ రెడ్డి అన్నారు. యాచారంలో ఉపాధి హామీ పనులు, కూలీలు నిర్వహిస్తున్న పనుల్ని ఎంపీడీవో సోమవారం పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనులు గ్రామీణులకు దోహదపడేలా క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న కూలీలందరికీ తప్పకుండా పని కల్పించాలని మస్టర్లలో కూలీల నమోదును పకడ్బందీగా పొందుపరచాలని సూచించారు. పని ప్రదేశంలో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య, కూలీలు ఇతరులు ఉన్నారు.

## నాంచారమ్మ జాతరకు ఎస్సై రాజుకు ఆహ్వాన పత్రిక అందజేత

### – నాంచారమ్మ జాతర ఆలయ కమిటీ చైర్మన్ లోకిని రాజు



**వెంకటాపూర్/ములుగు,మే 20 (ప్రజా జ్యోతి):** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామానుజాపూర్ గ్రామ పంటపొలాల మధ్య ఉన్న నాంచారమ్మ జాతర, మే 23న మహాజాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు వెంకటాపూర్ ఎస్సై చల్ల రాజుకు ఆలయ కమిటీ చైర్మన్ లోకిని రాజు సోమవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా లోకిని రాజు మాట్లాడుతూ నాలుగు రాష్ట్రాల నుండి ఎరుకల నాంచారమ్మ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వస్తారని పేర్కొన్నారు.కార్యక్రమంలో నాంచారమ్మ డైరెక్టర్లు కేతిరి బిక్షపతి,పల్లగొండ భాస్కర్, మానుపాటి రమేష్,దాసరి చిర్రా గణేష్ తదితరులు ఉన్నారు.

# "మే"పుష్పం వికసించింది



**తొర్రూరు, మే 20 ( ప్రజా జ్యోతి )** ఏడాదికోసారి మే నెలలో మాత్రమే పూసే మే పుష్పం తొర్రూరు మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పరాంకుశం రఘు నారాయణ ఇంట్లోఈ పూవు పూసింది. ఓ బంతి ఆకారంలో గుబురుగా వుండే, ఆకర్షణీయమైన రంగులో ఉన్న ఈ మే పుష్పాన్ని కాలనీవాసులు చూసి ఆనందంలో మునిగిపోయారు.

# గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాలు ఇవ్వకుంటే ఆందోళన




**తొర్రూరు , మే 20 ( ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 13000 గ్రామపంచాయతీలలో 60 వేల మంది సిబ్బంది పని చేస్తున్నారని వారికి వేతనాలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్( ఐ ఎఫ్ టి యు అనుబంధం )రాష్ట్ర అధ్యక్షులు కొత్తపల్లి రవి అన్నారు. సోమవారం తొర్రూరులో స్థానిక ఐఎఫ్టియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకటో తారీఖున ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నానని గొప్పలు చెప్పుకుంటున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి కి గత ఐదు ఆరు నెలలుగా జీతాలు రాని గ్రామపంచాయతీ సిబ్బంది వేతలు బాధలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.గ్రామాలలో కోట్లాదిమంది ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న గ్రామపంచాయతీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించటం లేదా అని అన్నారు. అత్యధిక వేతనాలు పొందుతున్న ఉద్యోగులకు ప్రతి నెల మొదటి తారీఖున జీతాలు ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అతి తక్కువ జీతాలకు అతి ఎక్కువ కష్టపడుతున్న జిపి సిబ్బంది సమస్యలు ఎందుకు పట్టించుకోవడం లేదని అన్నారు.కొన్ని జీపీలలో సంవత్సర కాలంగా మరికొన్ని జిపీలలో ఐదారు నెలలుగా వేతనాల బకాయిలతో కార్మికులు అర్ధాకలితో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిపి కార్మికులు అత్యధిక మంది దళిత గిరిజన అట్టడుగు వర్గాల లేనని వారి బాగోగులను రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తే ఐక్యంగా పోరాటం తప్పదని అన్నారు. మీ ఎన్నికలు సరే మా జీతాల మాటేమిటి అని రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వమే కల్పిస్తుందని అన్నారు. ఎన్నికల కోడ్ కు సంబంధం లేకుండా ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చినట్టుగా గ్రామపంచాయతీ సిబ్బందికి వేతనాలు వెంటనే విడుదల చేయకపోతే ఐక్య పోరాటాలకు సిద్ధమవుతున్నామని తెలిపారు. కనీస వేతనం 26,000 నిర్ణయించి పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించి మల్టీపర్పస్ వర్కర్ జీవోను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఇంకా ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాడిన మీకు మండల అధ్యక్షుడు గుండాల సోమనసయ్య మండల ఉపాధ్యక్షుడు పగిడి పాల ప్రమోద్, మండల నాయకులు బాదావత్ రాజేందర్, మాలోత్ యాకన్న,జాటోతు దేవేందర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

– సిరిసిల్ల ఇంచార్జ్ డిఎస్పీ నాగేంద్రాచారి – డబ్బులు వసూళ్లకు పాల్పడిన రిమాండ్



**రాజన్న సిరిసిల్ల, మే 20, (ప్రజాజ్యోతి):** ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సిరిసిల్ల ఇంచార్జ్ డిఎస్పీ నాగేంద్రాచారి అన్నారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ఇల్లంతకుంట మండలం నర్సక్కపేట గ్రామానికి చెందిన ర్యాగటి మల్లయ్య అనే వ్యక్తి 2018 సంవత్సరంలో నర్సక్కపేట గ్రామానికి చెందిన కొత్త లింగ రెడ్డి, బొల్లా రాము, తిప్పారవేని చంద్రశేఖర్, శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తులను హుస్నాబాద్ చెందిన ( ప్రస్తుతం సిరిసిల్ల పట్టణం) కారునాథం శివకృష్ణ అనే వ్యక్తి పరిచయ చేయగా, కారునాథం శివకృష్ణ అనే వ్యక్తి డబ్బులు తీసుకొని ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తాడని వారికి నమ్మబలికి వారి వద్ద నుండి 2023 సంవత్సరంలో పంచాయతీ సెక్రటరీ, వీఆర్వో, సింగరేణి ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి మోసం చేసి వారి వద్ద నుండి 6,50,000 రూపాయలు తీసుకొని తప్పించుకొని తిరుగుతుండగా శివకృష్ణను సోమవారం రోజున ఉదయం 11 గంటలకు ఇల్లంతకుంట బస్టాండ్ వద్ద అరెస్టు చేసి రిమాండ్ కి తరలించడం జరిగిందని డిఎస్పీ తెలిపారు..ఉద్యోగాలు ఇప్పిస్తామని యువతను తప్పుదోవ పట్టించి, వారి వద్ద నుండి భారీ మొత్తంలో నగదును వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్నారి పై కఠిన చర్యలు తీసుకుంటాం అన్నారు. కష్టపడి చదువుకొని ప్రభుత్వ నోటిఫికేషన్ల నియమావళి ప్రకారం అర్హతలు సాధించి ఉద్యోగాలు సాధించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని ,అలాంటి వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# మెదక్ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు గెలుపు ఖాయం

– గొల్లపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బండారిశ్రీనివాస్



**రాయపోల్ :మే 20 ప్రజా జ్యోతి** మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీఅభ్యర్థి నీలం మధు లక్ష మెజార్టీతో గెలుపు ఖాయమని గొల్లపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుబండారి శ్రీనివాస్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి. బిఆర్ఎస్. పార్టీలు చెప్పే మాయమాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరని. మెదక్ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు గెలుపు కోసంకష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో మన ప్రభుత్వమే అధికారంలో ఉందని. మెదక్ పార్లమెంటు సీటు కూడా భారీ మెజార్టీతో నీలం మధు ను గెలిపించి రాహుల్ గాంధీకి బహుమతిగా పంపిస్తామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న 200 యూనిట్ల ఉచితవిద్యుత్. మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం. 500 రూపాయల కుగ్యాస్ సిలిండర్ మరికొన్ని పథకాలను త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేసేందుకు సిద్ధంగా ఉన్నాడని ఆయన అన్నారు కాంగ్రెస్ పార్టీని ఆదరించి ప్రజలు గుర్తించి ఓటు వేశారని తెలిపారు.బీసీ సామాజిక వర్గానికి చెందిన నీలం మధు గెలుపు ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# జంట హత్య కేసులో నిందితుల అరెస్ట్

– జగిత్యాల డిఎస్పీ రఘు చందర్



**జగిత్యాల, మే 20 : (ప్రజాజ్యోతి)** జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం గోపులాపూర్ గ్రామంలో దీటి శ్రీనివాస్, దీటి మహేష్ లను దారుణంగా హత్య చేసిన కేసులో నిందితులను జగిత్యాల డీఎస్పీ రఘు చందర్ అరెస్ట్ చేశారు. సోమవారం నిందితులను అరెస్టు చేసిన అనంతరం డిఎస్పీ వివరాలు వెల్లడించారు. ఈ నెల 16 గురువారం అర్ధరాత్రి గోపులాపూర్ గ్రామానికి చెందిన బుర్ర నవీన్, జగిత్యాలకు చెందిన అతని స్నేహితులు జికూరి పవన్, మొగిలిపాల రాజేందర్, బొమ్మల వెంకటేష్, నాచుపల్లి గంగరాజం ఏ మనోజ్, చింతల శేషు, చొప్పరి అజయ్ అనే ఆరుగురు అదే గ్రామానికి చెందిన దీటి శ్రీనివాస్, దీటి మహేష్ లను ఇంటి కొనుగోలు విషయంలో పాత గొడవలు మనసులో పెట్టుకొని ఇనుప పైపులు, కర్రలతో విచక్షణ రహితంగా దాడి చేయగా శ్రీనివాస్ అక్కడే చనిపోయాడు. తీవ్రంగా గాయపడిన మహేష్ ను అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలించారు. దీనిపై బుగ్గారం పోలీస్ స్టేషన్లో శ్రీనివాస్ అక్క అటికేటి మమత ఫిర్యాదు మేరకు బుగ్గారం ఎస్సై ఎం శ్రీధర్ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారని, గోపులాపూర్ గ్రామంలో దీటి తార మరియు ఆమె కుమారుడు శ్రీనివాస్ లు 2018 సంవత్సరంలో తార తన బంధువు నాగుల అంజయ్య, అతని కుమారుడు రాజేష్ వద్ద ఇప్పుడు వాళ్లు ఉంటున్న ఇంటిని కొన్నారు. కానీ ఇదే ఇంటిని 2017 సంవత్సరంలో అంజయ్య తమకు అమ్మాడని తార ఇంటి పక్కనే ఉన్నటువంటి బుర్ర లక్ష్మి, ఆమె కొడుకులు నాగరాజు, నవీన్ లు కోర్టును ఆశ్రయించడం జరిగింది. 2023 లో కోర్టు ఆ సివిల్ కేసును కొట్టివేసింది. అప్పటినుండి ఆ రెండు కుటుంబాల మధ్య విభేదాలు ఉన్నాయి.మే 12న జగిత్యాలలో ఉంటున్న బుర్ర లక్ష్మి, నాగరాజు, వెంకటమ్మ, పూజ, నవీన్ లు ఎల్లమ్మ పట్నాల గురించి గోపులాపూర్ గ్రామంలోని తమ ఇంటికి వచ్చి ఉంటున్నారు. మే 16న రోజు రాత్రి వారి ఇంటి పక్కన ఉన్న దీటి తార, కొడుకు శ్రీనివాస్, దీటి మహేష్ లు దారిలో మంచం వేసుకొని తమకు అడ్డంగా పెట్టారని గొడవ జరిగింది. అట్టి గొడవ అనంతరం బుర్ర నవీన్ తమ ఇంటి పక్కన ఉన్న దీటి శ్రీనివాస్, అతనికి సహకరిస్తున్న దేటి మహేష్ లను ఎలాగైనా చంపాలని నిర్ణయించుకొని అదే రోజు రాత్రి తమ స్నేహితులైన జికూరి పవన్, మొగిలిపాల రాజేందర్, బొమ్మల వెంకటేష్, నాచుపల్లి గంగరాజం ఏ మనోజ్, చింతల శేషు, చొప్పరి అజయ్లను జగిత్యాల నుండి పిలిపించుకొని వారికి తమ గొడవ విషయం చెప్పి ఎలాగైనా శ్రీనివాసును, మహేష్ ను చంపాలని ఉద్దేశంతో వారు ఇంటి వద్ద ఉన్నది చూసి పై వారందరూ ఆ ఇంటికి వెళ్లి ఇనుప రాడ్లు కర్రలతో దాడి చేసి విచక్షణారహితంగా కొట్టి చుట్టుపక్కల వారు రాగా అక్కడి నుండి తమ వాహనాల్లో పారిపోయారు. దీటి శ్రీనివాస్ అక్కడికక్కడే మృతిచెందగా, మహేష్ వరంగల్ ఎంజీఎం లో చికిత్స పొందుతూ చనిపోయాడు. సోమవారం బుగ్గారం ఎక్స్ రోడ్ లో వాహనాల తనిఖీ చేస్తుండగా పై నిందితులు తమ వాహనాలలో వెళుతుండగా పట్టుకొని వారి వద్ద నుండి హత్యకు ఉపయోగించిన ఇనుప పైపులు, కర్రలు, ఒక కారు,మోటార్ సైకిళ్లు (2) మరియు సెల్ ఫోన్స్ (7) స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఇట్టి గొడవకు కారణమైన బుర్ర లక్ష్మి, నాగరాజు, వెంకటమ్మ, పూజలపై కూడా చట్టరీత్య చర్యలు తీసుకోబడతాయి అని డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో ధర్మపురి సీఐ ఏ రాం నరసింహారెడ్డి బుగ్గారం, ధర్మపురి, వెల్గటూరు, గొల్లపల్లి ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.